

ఆంతర్యం
రంగధామ

# ఆంతర్యం

(17వ పేజీ తరువాయి)

కొంతమంది స్నేహితులు కాంతారావు వ్యాపకం లేకుండా వుండటానికి అలవాటుపడిపోతున్నాడనీ, వివాహంచేస్తే బాధ్యతనేది తెలిసివచ్చి సరియైన మార్గంలోకి వస్తాడని రఘువయ్యగారితో చెప్పారు. ఆవిషయం కొంతవరకూ నిజమేనని ఆయన కూడా ఒప్పుకున్నారు

కాంతారావుకు వివాహమైనదగ్గర్నుంచీ ఇంట్లో ఎక్కువసేపు గడిపేవాడు. కాంతారావు భార్య శశిరేఖ చాలా అమాయకురాలు. ఎంత సేపూ భర్త తనకెదురుగా వుంటే చాలునను కొనేదిగాని, వ్యాపకంగాని అర్జనగాని లేకపోతే తమ భవిష్యత్తు ఎలా గడుస్తుందా ? అన్న ఆలోచన ఆమెకూలేదు

రాఘవయ్యగారుగాని, ఇతరులుగాని వూహించిన మార్పేమీ కాంతారావులో కన్పించలేదు. వివాహమై రెండేళ్ళయినా కాంతారావు ఉద్యోగప్రయత్నం చెయ్యడంగాని, ఏదైనా పని చెయ్యాలన్న ఆత్రుతలోగాని వున్నట్టేలేదు. అయినా రాఘవయ్యగారు ఎక్కువగా విచారించలేదు.

అప్పటికి ధర్మారావు బి ఏ; బి ఇడి పూర్తి చేసి టీచరుపనిలో చేరాడు. తన అన్నగారి గురించి ఎంతో ఆలోచిస్తూ బాధపడేవాడు. తన తండ్రే అతనిని బాగా గారాబంచేసి పాడు చేస్తున్నాడని గ్రహించాడు. అనేకసార్లు తండ్రితో "అన్నయ్య కూడా ఏదైనా వుద్యోగప్రయత్నం చేస్తే బాగుండును" అన్నాడు ఆయన వినీ, విననట్లూరుకునేవారు.

ఎక్కువసార్లు ధర్మారావు ఈ సంగతి అంటుంటే, "కలిసి రావాలిరా ! మనచేతిలో ఏముంది చెప్పు?" అని విధిమీదకు తోసేసేవారు రాఘవయ్యగారు. అలాగే రోజులు గడిచిపోతూండేవి కాంతారావు ఒక సారి తండ్రి పనిచేస్తున్న జూటుమిల్లులోనే రెండు మూడు నెలలు పనిచేసి మానేశాడు. అతను మానెయ్యడానికి పెద్ద కారణమేమీ వుండదు. ఎవరైనా అతన్నేదైనా పని, 'ఎందుకు సరిగ్గా చెయ్యలేదు ?' అని అడిగితే అతను కోపం తెచ్చుకొని పనిమానేస్తాడు అలాగే యజమాని ఏదో అన్నాడని జూటుమిల్లుపని మానేశాడు.

ధర్మారావు ఈ సంగతి తెలుసుకొని అన్నతో, "అదేమిట్రా అన్నయ్యా ! వాడు ఏదో అన్నాడని పనిమానేస్తే ఎలాగరా ? బుర్ర అమ్ముకొన్నతర్వాత సరిగ్గా పనిచెయ్యాలిగాని, వాడేదో అన్నాడని అసలు మానేస్తే ఎలా ?" అన్నాడు. కాంతారావు ఏమీ జవాబు చెప్పలేదు.

రాఘవయ్యగారు ధర్మారావుమాటలు విని, "వాడికి పౌరుషం జాస్తిరా ఎవరైనా వాడి నేమైనా అంటే వాడు పడడు" అన్నారు

తండ్రికూడా అన్నను వెనకేసుకొని రావడం ధర్మారావుకు చాల కష్టం కలిగించింది" అలాగైతే వుద్యోగమే చెయ్యడం కష్టంకదా నాన్నా !" అన్నాడు

"అవునురా వాడితత్వానికి ఉద్యోగం లాభం లేదురా. వ్యాపారం ఏదైనాచేస్తే మంచిది" అన్నాడు రాఘవయ్యగారు.

ధర్మారావు మెల్లిగా ఆలోచించాడు. తండ్రి చెప్పింది నిజమే. ఉద్యోగమంటే ఒకడన్న మాటల్ని పట్టించుకోకుండా ఉండగలిగినవాడికే సాధ్యమవుతుంది. తన అన్నకి మాట అనిపించుకోకుండా వుండగల సమర్థతలేదు. మాట అనిపించుకొన్నా పని చేయగల ఓర్పులేదు. తండ్రి చెప్పినట్లు ఏదైనా వ్యాపారం చెయ్యగలడేమో ? మళ్ళీ కాంతారావుకి ఆ తెలివితేటలుకూడా లేవని ధర్మారావుకి అనుమానం. ఏమైనా, ఒక చిన్నకిళ్ళీకొట్టు పెట్టించిచూడాలి అన్నచేత అనుకున్నాడు.

ఒక్కొక్క కార్యం చెయ్యాలని అనుకుంటూండగానే నెలలూ, సంవత్సరాలూ గడిచిపోతాయి. కాంతారావుచేత కిళ్ళీకొట్టు పెట్టించాలని రాఘవయ్యగారూ, ధర్మారావూ ఆలోచిస్తూండగానే రెండు సంవత్సరాలు గడిచిపోయాయి. కారణమేమంటే అనలువ్యక్తియైన కాంతారావుకి శ్రద్ధ లేదు. తక్కినవారికి తీరికలేదు.

> ఒక యువకుడికి ఒక ప్రియురాలు ఉంది. ఆమెను అతడు ఎన్నిసార్లు ముద్దు పెట్టుకున్నా ప్రతిసారి కళ్లు మూసుకుంటుంది. అలా ఎందుకుమూసుకుంటుందో వానికి అర్థం గాక ఒక స్నేహితుని అడిగాడు. దానికి కారణం ఏమిటో చెప్పమన్నాడు. ఒక సారి అద్దంలో చూసుకుంటే సంగతి వానికే తెలుస్తుందని వాని స్నేహితుడు చెప్పాడు. వానికి అది అర్థం గాక తెలిసేలాగ వివరంగా చెప్పమన్నాడు దానికి.
>
> పి. రవీందర్ రెడ్డి (హనుమకొండ)

ఈ రెండేళ్ళలోనూ ధర్మారావుకి పెళ్ళికావటం, భార్య కాపరానికిరావటంకూడా జరిగింది. నిర్మల, అంటే ధర్మారావుభార్య, చాలా తెలివైనది ఆమె ఈ ఇంట్లో ప్రవేశించగానే తోటికోడలూ, బావగారూ, వాళ్ళ రెండేళ్ళ సుపుత్రుడూ ఆ యింట్లో ఘరానా అతిథులలాగ చలామణి అవుతున్నారని, కష్టమంతా తన భర్తదేనని గ్రహించింది అనతి కాలంలోనే అన్నదమ్ములిద్దరూ విడిపోవడం శ్రేయస్కరమనీ, దానివల్ల బావగారికి సంసార బాధ్యత తెలిసివస్తుందనీ, భర్తకు బోధపరిచేది. ధర్మారావు ఇన్నాళ్ళూ ఈ విషయం ఈ దృష్టితో ఆలోచించలేదు. పైగా తండ్రికి అన్నమీదవున్న ప్రేమ తెలుసునుకాబట్టి ఎలాగా తండ్రి బ్రతికుండగా అటువంటిది జరగడం కల్ల.

భర్త అభిప్రాయాల్నీ, ఇంట్లో పరిస్థితుల్నీ నిర్మల బాగా అవగాహనచేసుకుంది. అయినా అవకాశం వచ్చినప్పుడల్లా భర్తకు, మామగారికి పెద్దకొడుకుయందున్న పక్షపాతం అసహజమనీ, ధర్మారావూ, రాఘవయ్యగారూ ఓర్పు పట్టబట్టే కాంతారావు అలా చెడిపోయాడనీ చెపుతూండేది. ధర్మారావు భార్యమాటల్ని విని మెల్లమెల్లగా ఆలోచిస్తూ, అవి చాలావరకూ నిజాలని నమ్మే స్థితికి వచ్చాడు.

కిళ్ళీకొట్టు పెట్టిస్తే కాంతారావు బాగుపడతాడేమోనని, నాలుగైదు వందలు ఖర్చుపెట్టి కొట్టు తయారుచేయించి, కొన్ని సోడాబుడ్లూ, స్టేషనరీ సామానులు వగైరాకూడా పెట్టించి కొట్టు తెరిపించారు కొడుకుచేత రాఘవయ్యగారు. అప్పుడప్పుడు తమూ, ధర్మారావూ వెళ్ళి అజమాయిషీ చేస్తూండేవారు.

కొన్నిరోజులు మందంగా నడిచిన తరువాత అమ్మకం హెచ్చు కానారంభించింది రోజుకి అయిదూ పదీ మిగుల్తూండేవి. కాని ఆ డబ్బు ఇంట్లో ఖర్చుకివ్వటంకాని, లేకపోతే కొట్లో మరికొన్ని సరుకులు ఖరీదుచేసి పెట్టడంగాని చేసేవాడుకాదు కాంతారావు. ఆ డబ్బు తన యిష్టంవచ్చినట్లు ఖర్చుపెట్టేవాడు. అప్పటికీ రాఘవయ్యగా రేమీ అనలేదు.

నిర్మలమట్టుకు భర్తను హెచ్చరిస్తూండేది. తోడికోడలికి బట్టలైనా సరిగ్గాలేవనీ, ఇంటి ఖర్చుకు కొంత బావగారి నడిగి తీసుకోమనీ, దానితో ఆమెకు బట్టలూ, నగలూ చేయించమనీ ధర్మారావుకు చెప్పేది ధర్మారావు అన్నను "వదినకు బట్టలూ అవీ కొనరా !" అని అంటే కాంతారావు అలాగే అనేవాడుకాని, కొట్టుమీద వచ్చిన డబ్బు ఒక దమ్మిడీ అయినా ఇంటికింద ఖర్చుపెట్టేవాడుకాదు. ధర్మారావుకి కాంతారావు ఎందుకలా చేస్తున్నాడో అర్థమయ్యేదికాదు. నిర్మలకు రాను రాను సహనం నశించసాగింది.

చివరికిభార్యాభర్తలిద్దరూకాంతారావుకావాలనేఇంటి ఖర్చుకు డబ్బివ్వడం మానేస్తున్నాడనీ, తను గణించిన డబ్బంతా రహస్యంగా దాచుకుంటున్నాడనీ, అది భవిష్యత్తులో ఎప్పుడో అన్నదమ్ములిద్దరూ వేరైనతరువాత తన స్వంతానికి పనికి వస్తుందని అలా చేస్తున్నాడనీ అనుమానపడ్డారు అదే నిజమైననాడు తాము ఎంత తొందరగా వేరైతే అంత మంచిదనుకొన్నారు నిర్మలా, ధర్మారావులు.

రాఘవయ్యగారుకూడా ఇంట్లో పరిస్థితుల్ని కనిపెడ్తూనే వున్నారు ధర్మారావు వూహల్నీ, నిర్మల మాటల్నీ ఆయన అర్థంచేసుకున్నారు. అప్పుడప్పుడు పాతికా ముప్ఫై ధర్మారావు చేతిలో పెడ్తూ, అది కాంతారావు ఇంటిఖర్చుకు తన చేతికిచ్చిన డబ్బు అని చెపుతూండేవారు ధర్మారావుకి ఈ విషయంలో తండ్రి అబద్ధం ఆడుతున్నాడనీ,

# ఆంతర్యం

కాంతారావు తన్నుతప్పుకు తప్పించుకోటానికి ప్రయత్నిస్తున్నాడని తెలుసు. అయినా తండ్రియందుగల గౌరవంచేత గుంభనగా వూరుకొని ఆ డబ్బును భార్యకిచ్చేవాడు. ఎందుకంటే సంసారమంతా నిర్మలచేతిమీద నడిచేది.

కొట్టు పెట్టుకున్నైనా బ్రతకగలుగుతాడేమోనని ఆశపడిన తండ్రికి రెండుసంవత్సరాలలోపునే పూర్తిగా ఆశాభంగం కలిగించాడు కాంతారావు. కొట్టుకు వచ్చినవాళ్లని నిర్లక్ష్యంచేసీ, ముక్కూ మొహం ఎరగనివాళ్ళకు అరువులిచ్చీ, ఏరోజు వచ్చినడబ్బు ఆ రోజు తన ఇష్టం వచ్చినట్టు ఖర్చుచేసి కిళ్ళీకొట్టుకూడా నిర్వహించుకోలేక పోయాడు కాంతారావు. పైగా కొట్టు తాకట్టు పెట్టి రెండువందలు అప్పుకూడా వాడేశాడు. పాడాబుడ్లన్నీ బ్రద్దలైపోయాయి. రావలసిన కాతా లన్నీ వచ్చే ఆశ లేకుండా పోయింది. పైగా పరపతి ఏమాత్రం సంపాయించుకోలేకపోయాడు కాంతారావు.

మళ్ళీ యథాప్రకారం ఇంట్లో సోమరితనంగా బీడీలుకాలుస్తూ కూచోడం ప్రారంభించాడు. రాఘవయ్యగారు మనస్సులో ఏం బాధపడ్డారో భగవంతుడికే తెలియాలిగాని, పైకి మాత్ర మేమీ అన లేదు. ధర్మారావూ, నిర్మలా చాలా బాధపడ్డారు. కాంతారావు బాగుపడే మార్గమేమీ వారికి తోచలేదు. ఇంటి ఖర్చుకేనా ఇవ్వకుండా తనకితాను నిరవాకం చేసుకుంటున్నాడేమో ననుకొన్న వూహకూడా, నిజంకాదని రుజువైంది

రాఘవయ్యగారికి పెద్దకొడుకువిషయం తెగని సమస్య అయి జెంగలాగ పట్టుకొని చివరకు మనోవ్యాధిక్రింద పరిణమించింది. తను పిల్లల్ని పెంచ టంలో ఏ లోపమూ చెయ్యకపోయినా ధర్మారావు చక్కగా చదువుకొని అభివృద్ధిలోకి రావడం అవే అవకాశాలుగల కాంతారావు వట్టి అప్రయోజకు డవడం ఆయనను ఎంతో బాధించేది కాంతారావు కొద్దిగా గణించినా ఆయన తృప్తిపడేవారు. కాని అతనికి ఉద్యోగంచెయ్యడం చాతకాదు, వ్యాపారం చెయ్యడం తెలియదు.

నిర్మల బాధపడడం సహజమే! అసలామె ఎంతో మంచిదికాబట్టే ఇన్ని రోజులైనా ఓపిక పట్టోంది. లేకపోతే పెద్దవాడైన బావగారూ, భార్యా బిడ్డతో ఇంట్లో హాయిగా కూర్చొని తినడం, చిన్నవాడైన తన భర్త నానా కష్టాలూ పడి సంపాదించిన డబ్బు తమ బట్టలకూ, సరదాలకూ ఏమీ మిగుల్చుకోకుండా ఇంటిక్రింద ఖర్చు పెట్టడం ఏ స్త్రీ సహించగలదు? రాఘవయ్యగారికి నిర్మలంటే చాలా ఆపేక్ష. పెద్దకోడలు తెలివైనది కాకపోవడంవల్లా, చిన్నకోడలు అన్నీ సర్దుకుంటూ సంసారాన్ని ఒద్దికలోకి తీసుకురావడం, మామగార్ని ప్రత్యేకంగా గౌరవించి కనుక్కుంటుండడంవల్ల నిర్మలంటే రాఘవయ్యగారికి గౌరవం కూడా వుంది.

రాఘవయ్యగారికి జబ్బు చేసింది శరీరంలో బలహీనత ఏర్పడింది మనస్సులో వ్యాకులత హెచ్చవసాగింది. డాక్టర్ని తీసుకురావడం, మందివ్వటం, సేవ చెయ్యటం అన్నీ నిర్మలా, ధర్మారావులే చేస్తున్నారు ఇంట్లో వుండికూడా కాంతారావు తండ్రి గురించి కనుక్కొనేవాడు కాదు. పైగా ఎప్పుడూ మంచంమీదపడుకొని బీడీలు కాలుస్తూ ఆలోచిస్తూ వుండేవాడు

ధర్మారావు కాంతారావు తత్వాన్ని చూసి మండిపడిపోనారంభించాడు. ఏమైనాసరే త్వరలోనే వేరు కాపరం పెట్టాలని నిశ్చయించాడు. తండ్రి కంత జబ్బుగా వున్నప్పుడుకూడా అన్న తనకు సాయంగా వుండకపోవడం, పైగా ఇంట్లోవుండి కూడా తండ్రికి సేవచెయ్యకపోవడం చూసి ధర్మారావు తండ్రికి జబ్బు తగ్గగానే ఈ విషయం ఏదో తేల్చుకోవాలనే నిర్ణయానికి వచ్చాడు.

చిన్నకొడుకు పడుతున్న చిరాకంతా రాఘవయ్యగారు గమనిస్తూనే వున్నారు. ఆ విషయంలో చిన్నకొడుకుదేమీ తప్పులేదు. బహుశా తన తదనంతరం వారిద్దరూ వేరవక తప్పదేమోననుకుంటూండేవాడాయన. నిజంగా వాళ్ళిద్దరూ వేరైతే తన పెద్దకొడుకు గతేమిటి?

---

రెండవ తరగతి పెట్టెలో ఎక్కిన ఒక అమ్మాయికి ప్రకృతి దృశ్యములంటే చాలా సరదా. అందుకని ఆమె రైలు వెళుతున్నప్పుడు ఈ కిటికీనుంచి ఆ ఆ కిటికీవద్దకు, ఆ కిటికీనుంచి ఈ కిటికీవద్దకు మారుతున్నది.

అదే పెట్టెలో ఎక్కిన ఒక యువకుడు చాలాసేపటి నుంచి ఇది చూస్తున్నాడు. పోనుపోను అతనిలో ఓర్పు సన్నగిల్లినది. అతడిక ఉండబట్టలేక "ఏమండీ! మీ రీవిధంగా మారుతుంటే రైలు పట్టాలు కొడుతుందని భయంగావుంది" అన్నాడు

కె. వి. చలపతిశాస్త్రి (గుడివాడ)

---

రాఘవయ్యగారికి జబ్బు ఎక్కువై అవసాన దశ సమీపించింది. డాక్టరు ఆయన రెండు, మూడు రోజులలో చనిపోతాడని చెప్పాడు. అది విన్న కొడుకులూ, కోడళ్లూ కళ్లమ్మట సంతత ధారాపాతంగా అశ్రువులు కారుస్తున్నారు. ఆయన చాలా నీరసంగా వున్నారు. చిన్న కొడుకును దగ్గరకు పిల్చారు. నీరసంగా, మెల్లిగా ఆయాసంతో మాట్లాడ నారంభించారు

"నాయనా! ..... అన్నీ తెలిసినవాడివి. నాదొక ... కోరిక. ...తీర్చాలిరా!" అన్నారు అతికష్టంగా మాట్లాడుతూ.

"చెప్పండి, నాన్నా! మీరేంచెయ్యమన్నా చేస్తాను" అన్నాడు ధర్మారావు దుఃఖం ఆపుకోలేక ఏడుస్తూ.

"నాకు. ...ఇద్దరు. ...కొడుకుల. ... మీదా ...ప్రేముంది. నిన్ను. ..చిన్నప్పటి నుంచీ. ...కష్టపెడుతున్నాను. కానీ. ..చూడు బాబూ! ఈ అయిదువేళ్లూ. ...ఒక్కలా గుండవు నీ అన్న. ...సమర్థుడు. ...కాలేదు. అది నా కర్మ. ...వాడిని ..నీ చేతుల్లో పెడుతున్నాను" అన్నారు రాఘవయ్యగారు కొడుకు వైపు చూస్తూ.

ధర్మారావు తండ్రి ఉద్దేశాన్ని గ్రహించాడు. తండ్రికి అన్నమీదవున్న ప్రేమ తెలుసు. తనకీ బాధ్యత తప్పదు! అయినా ఎంతైనా అతను తన అన్న! తను కాకపోతే అతన్నింకెవ రాదరిస్తారు?

"అలాగే నాన్నా! నువ్వావిషయంలో నిశ్చింతగా వుండు" అన్నాడు ధర్మారావు తండ్రితో. తండ్రియొక్క జబ్బు, అతని కోరికా, ఆయనకూ తనమీదవున్న ప్రేమా, అన్నీ అతనికి జ్ఞాపకం వచ్చాయి. తన అన్న అసమర్థుడు. దాని గురించి తను అతనిమీద కోపంతెచ్చుకొని లాభంలేదు. అతనికోసం తను కొంత త్యాగం చెయ్యవలసిందే! అది తండ్రి కోరిక.

కొడుకు మనోభావాల్ని కనిపెట్టి రాఘవయ్యగారు, అతని చెయ్యి తన చేతుల్లోకి తీసుకొని కొడుకువైపు, సంతోషంగా చూశారు ఆనాటి రాత్రే రాఘవయ్యగారు మరణించారు

కర్మచేస్తున్న రోజుల్లో అందరి మనస్సులూ విచారాతిరేకంచేత స్తబ్ధమైపోయాయి తండ్రి పోవడం ధర్మారావునీ, కాంతారావునీ సమంగానే బాధించింది. నిర్మలకు మామగారు పోవడం తీరని వెలితిలా కన్పించింది.

పదిహేనురోజుల తర్వాత ఒకనాడు సాయంకాలం ధర్మారావు పడక కుర్చీలో కూర్చుని ఆలోచించసాగాడు తండ్రికి తను ఇచ్చిన వాగ్దానం గురించి. ఆ విషయంలో తను కొంచెం తొందర పడ్డానేమో అనుకున్నాడు పైగా భార్య కీవిషయం చెప్పలేదు

ధర్మారావుకి, గతించిన విషయాలన్నీ జ్ఞాపకానికి రాసాగాయి. తల్లిపోయినబిడ్డల్ని—తమను—తండ్రి ఎంత కష్టపడి పెంచాడో, ఆయన ప్రేమ ఎలాటిదో గుర్తుకొచ్చింది. మాతాపితరులు బిడ్డలందర్నీ సమానంగానే ప్రేమిస్తారు. తన చదువుకోసం, అక్కల పెళ్ళిళ్ళకోసం తండ్రి ఎన్నెన్ని కష్టాలు పడ్డాడో లెక్కలేదు తాను ప్రయోజకుడవబట్టి తండ్రి తనగురించి బాధపడనక్కరలేకపోయింది. తన అన్న అప్రయోజకుడవడంవల్ల, తండ్రి ప్రేమ బాహ్యంగా చూపించినట్లు కన్పించింది; కాని అన్న విషయంలో అలాగున్నా, అంతర్యంలో తండ్రి తనను తక్కువచేసిం దేమీలేదు.

ఆ బాధ్యతనే తండ్రి తన కప్పగించాడని ధర్మారావు కర్థమైంది తనతండ్రి ఎంత గంభీర స్వభావంగలవాడో ధర్మారావు గ్రహించాడు. (తను వేరింటికాపురం పోవడంలోని సంకుచితత్వం ధర్మారావుకి తెలిసింది) తండ్రి అప్పగించిన బాధ్యతనే నిర్వర్తించదల్చుకున్నాడు. ఆ నిర్ణయానికి రాగానే ధర్మారావు కేదో తృప్తి లభించినట్లయింది. ★